నష్టపోయిన అరటి రైతులను ఆదుకోవాలి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ తలారి వెంకట్రావు


పెద్దేవంలో అరటి తోటను పరిశీలిస్తున్న తలారి వెంకట్రావు

తాళ్లపూడి: రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని, అరటి రైతులకు తక్షణం నష్ట పరిహారం అందజేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు డిమాండ్ చేశారు. మండలంలోని పెద్దేవం, రావూరుపాడు గ్రామాల్లో రెండు రోజుల క్రితం గాలులకు సుమారు 20 ఎకరాల్లో అరటి తోట పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. తలారి వెంకటరావు, జిల్లా మాజీ ప్రచార కమిటీ అధ్యక్షుడు తోట రామకృష్ణ, సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు పడిపోయిన తోటలను పరిశీలించారు. తలారి వెంకట్రావు మాట్లాడుతూ, అరటిగెలలు గాలులకు నేల మట్టవ్వడం చాలా బాధాకరమన్నారు. ఎకరాకు పెట్టుబడి రూ.2.5 లక్షలు అవుతుందన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రామకృష్ణ, గ్రామ కమిటీ అధ్యక్షుడు సుబ్బారావు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు సమస్య పరిష్కరించాలి

దేవరపల్లి: త్యాజంపూడి– యర్నగూడెం రోడ్డు సమస్యను తక్షణం పరిష్కరించాలని మంగళవారం రాత్రి జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో త్యాజంపూడి గ్రామస్తులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశానికి సీఐటీయూ మండల కార్యదర్శి భగత్ అధ్యక్షత వహించారు. ఉపసర్పంచ్ వెంకటసతీష్ మాట్లాడుతూ, పాలకులు మారినా ప్రజా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. పార్టీలకు అతీతంగా సమస్య పరిష్కారం కోసం ప్రజలు కలిసి రావాలని మాజీ సర్పంచ్ రత్నారెడ్డి అన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయండి


వేణుగోపాలకృష్ణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కొవ్వూరు నియోజకవర్గ నేతలు

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ పదవులు పొందిన ప్రతి ఒక్కరూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం బొమ్మూరులోని పార్టీ కార్యాలయంలో ఆయనను కొవ్వూరు నియోజకవర్గానికి చెందిన పార్టీ రాష్ట్ర మున్సిపల్ వింగ్ సెక్రటరీ రుత్తల ఉదయభాస్కర్, జిల్లా గ్రీవెన్స్ సెల్ ప్రెసిడెంట్ నాగలపల్లి శ్రీనివాసరావు, మున్సిపల్ వింగ్ జనరల్ సెక్రటరీ సిద్దాన శ్రీనివాస్, పంచాయతీరాజ్ నియోజకవర్గ అధ్యక్షుడు మార్ని రామకృష్ణ, మున్సిపల్ కమిటీ సెక్రటరీ ఓలిపల్లి రాంబాబులు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

షాపుల్లో తనిఖీలు

పెరవలి: దీపావళి మందుగుండు సామగ్రి హోల్‌సేల్ షాపుల్లో నిబంధనలకు అనుగుణంగా అమర్చాలని, వీటిలో ఎటువంటి తేడాలు వచ్చినా కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ నిరంజన్ హెచ్చరించారు. పెరవలి పరిధిలో ఉన్న శివశక్తి క్రాకర్స్, శ్రీలక్ష్మి గణపతి, మారుతీ దీపావళి షాపులను మంగళవారం పరిశీలించారు. షాపుల రికార్డులు పరిశీలించి సంతృప్తి చెందారు. అనంతరం గోడౌన్‌లలో ఉన్న సరకును పరిశీలించి, అందుకు తగిన బిల్లులు తనిఖీ చేశారు. ఈ షాపుల వద్ద ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో ఆర్ఐ పావని, స్థానిక వీఆర్‌ఓలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

లేఅవుట్‌లలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

పెరవలి: జిల్లాలోని లేఅవుట్‌లలో మౌలిక సదుపాయాల గురించి స్వయంగా పరిశీలించి, ఇళ్ల మంజూరైన లబ్ధిదారులు ఎందుకు నిర్మించుకోవటం లేదో తెలుసుకోవటానికే క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నానని జిల్లా హౌసింగ్ పీడీ బుజ్జి తెలిపారు. పెరవలి, కొత్తపల్లి అగ్రహారం, ముక్కామల, నల్లాకులవారిపాలెం, నడుపల్లి గ్రామాల్లోని లేఅవుట్‌లను మంగళవారం పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. కొన్ని లేఅవుట్‌లలో డ్రైనేజీలు లేవని, మరికొన్ని చోట్ల అసలు ఏమీ లేవన్నారు. వీటిని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. నిర్మాణాలు పూర్తి చేసుకుంటే త్వరగా నిధులు విడుదల అవుతాయన్నారు.